ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునిక 'బస్ బే'లు

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- 'దక్షిణ'లో నాలుగు చోట్ల ప్రారంభం



జగదాంబ జంక్షన్ వద్ద బస్ బేను ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గంలోని జగదాంబ జంక్షన్, ఎల్ఐసీ బిల్డింగ్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్, లలితా జ్యూయలరీ వద్ద ఆధునికీకరించిన బస్ బేల ను బుధవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రయాణికులు, విద్యార్థుల సౌకర్యార్థం నగరంలోని పలు బస్టాప్‌లను ఆధునికీకరించి, ప్రారంభించినట్లు తెలిపారు. జగదాంబ జంక్షన్ వద్ద రూ. 25.93 లక్షలు, ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద రూ.26.33 లక్ష లు, ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద రూ.24.73 లక్షలు, లలితా జ్యూయలరీ వద్ద రూ.26.45 లక్షలతో ఆధునిక బస్ బేలను తీర్చిదిద్దామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో విశాఖ అభివృద్ధిలో దూసుకుపోతోందని చెప్పారు. ఆయన సూచనల మేరకు ఇప్పటికే పలు బస్ బేలు ప్రారంభించామన్నారు. త్వరలోనే విశాఖ నగరం పరిపాలన రాజధాని కానుందని, ఈ తరుణంలో మంచి బస్ బేలు అవసరమని భావించి వీటి ని ఆధునికీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన బస్ స్టాప్‌లను అంచలంచెలుగా అభివృద్ధి చేస్తామన్నారు.

సీఎం పాలనలో సుందరంగా నగరం

ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి విశాఖ నగరాన్ని ఎంతో సుందరంగా తీర్చిదిద్దుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగర ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, సంక్షేమం అందించడంలో ముందున్నారన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా కళాశాలలో తెలుగు భాషా వారోత్సవాలు


క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

అల్లిపురం: ఈ నెల 29న గిడుగు వెంకట రామ మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి తెలిపారు. దీంట్లో భాగంగా బుధవారం కళాశాలలో తెలుగు సాహిత్యంలో విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి ఎస్వీ పద్మకుమారి, అధ్యాపకులు బి.రాధమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

పేద విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం


వెంకట ఆదిలక్ష్మికి ఆర్థిక సాయం అందజేస్తున్న బత్తిన నవీన్‌కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు కనకల వీధిలో నివసిస్తున్న దాసరి వెంకట ఆదిలక్ష్మి అనే విద్యార్థిని ఆర్థిక ఇబ్బందులతో కళాశాల ఫీజు కట్టలేక సతమతమవుతోంది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు బత్తిన నవీన్‌కుమార్ తన వంతు సాయంగా బుధవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థినికి ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బంటుపల్లి ధనలక్ష్మి, హారిక, రాలి కుమారి, దివ్య, శంకరరావు, జితేంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చెవి వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు


మాట్లాడుతున్న డాక్టర్ అప్పారావు

మహారాణిపేట: పలు రకాల ఇన్‌ఫెక్షన్ కారణంగా చెవిలో తీవ్రమైన ఇబ్బందులు వస్తాయని, నిర్లక్ష్యం వహిస్తే మెదడుకు సోకే అవకాశం ఉందని ఆంధ్రా మెడికల్ కాలేజీ(ఏఎంసీ) విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ ఎస్.కె.ఈ.అప్పారావు హెచ్చరించారు. ఈ నెల 18, 19 తేదీల్లో బంగ్లాదేశ్‌లో చెవికి సంబంధించిన వ్యాధులు, నివారణ పద్ధతులపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని విశాఖ తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం తన క్లినిక్‌లో అప్పారావు విలేకరులతో మాట్లాడుతూ కర్ణభేరి, చెవిలోపల ఉండే చిన్న ఎముకలు, చెవిలో కృత్రిమ ఎముకల ఏర్పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారన్నారు. ఈ సమావేశంలో విశ్రాంత డీఎంహెచ్‌వో డాక్టర్ సరోజని, డాక్టర్ సుస్మిత పాల్గొన్నారు.

30న విజయవాడలో రాష్ట్ర సదస్సు

అల్లిపురం: ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు పరిశ్రమ రక్షణ కోసం ఈ నెల 30న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు జై ఆంధ్ర ఉద్యమ నేత దేవరపల్లి మహేష్ తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన జైఆంధ్ర రాజకీయ సమ్మేళన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక హోదా నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ కల్పిస్తే నేటి ప్రధాని మోదీ ఇవ్వకుండా తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. జై ఆంధ్ర జేపీసీ చైర్మన్ చింతాడ సూర్యం మాట్లాడుతూ ఏళ్ల గడిచినా విభజన చట్టం హామీలకు అతీగతీ లేదన్నారు. 2024 ఎన్నికల్లో జై ఆంధ్ర అభ్యర్థులు రంగంలోకి దిగి మోదీ మోసపూరిత విధానాలను ఎండగట్టి ప్రత్యేక హోదా పార్లమెంట్ సాక్షిగా సాధించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జై ఆంధ్ర జేపీసీ అధికార ప్రతినిధి గోరింత అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ మేయర్ సేవలు మరువలేనివి


ఎన్ఎస్ఎన్ రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు

సీతమ్మధార: విశాఖపట్నం ప్రథమ మేయర్ ఎన్ఎస్ఎన్ రెడ్డి సేవలు మరువలేనివని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఎన్ఎస్ఎన్ రెడ్డి 32వ వర్ధంతి సందర్భంగా బుధవారం జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా సెంట్రల్ పార్కు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1981లో ప్రథమ మేయర్‌గా ఎన్ఎస్ఎన్ రెడ్డి విశాఖ నగరాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన హయాంలో రోడ్ల విస్తరణ, తాగునీరు, విద్యుత్తు, పారిశుద్ధ్యం, పార్కుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యమిచ్చారన్నారు. జనతా పార్టీ తరఫున 1978లో శాసనసభ్యుడిగా పనిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎన్ రెడ్డి స్మారక ట్రస్ట్ అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి, కుటుంబ సభ్యులు నీలాపు స్వర్ణలత, నీలాపు సుధీర్‌రెడ్డి, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, వేమన సంక్షేమ సంఘం సభ్యులు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన



డాబాగార్డెన్స్: బురుజుపేట కనక మహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్జక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

ఏడో రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న లక్ష్మీ పూజలు బుధవారం నాటికి ఏడో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన


చాకలిపేటలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

తాటిచెట్లపాలెం: దక్షిణ నియోజకవర్గ పరిధి 42వ వార్డు రైల్వే న్యూకాలనీ చాకలిపేటలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు బుధవారం కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ పనుల్లో భాగంగా కార్పొరేటర్ విజ్ఞప్తి మేరకు 235 సచివాలయం పరిధి ప్రాంతంలో డ్రైనేజీలు, రోడ్లు నిర్మించేందుకు రూ.19.98 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ షరీఫ్, డైరెక్టర్ సకలాభక్తుల ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, పార్టీ సీనియర్ నాయకులు ఆళ్ల శ్రీనివాస్, రాజపాత్రుడు, అజయ్ రెడ్డి, జీవీఎంసీ ఏఈ రమణమ్మ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల రుణాల మంజూరుకు కృషి


టిడ్కో ఇళ్ల యజమానులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: ప్రభుత్వం అందజేసిన టిడ్కో ఇళ్లకు రుణాలు మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు 39వ వార్డు కార్పొరేటర్ ముహమ్మద్ సాధిక్ తెలిపారు. వార్డులోని చిలకపేట టిడ్కో ఇళ్ల ప్రాంతంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల యాజమానులకు 50 ఏళ్ల వయసు దాటిపోవడంతో బ్యాంక్‌లు రుణాలు మంజూరు చేయడం లేదన్నారు. ఈ అంశంపై ప్రభుత్వ అధికారులతో చర్చించి ఇంటి యజమానులు వారసత్వం కింద ఇంట్లో తక్కువ వయసున్న కొడుకు, కుమార్తెల పేరుతో వీలునామా రాయిస్తే, వారికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్‌లు ముందుకొస్తున్నాయన్నారు. దీనిపై ప్రభుత్వం జీవో కూడా విడుదల చేసిందని చెప్పారు. రుణాలు కావల్సిన వారందరూ వారసత్వ వీలునామాలు రాసుకుని వచ్చినట్టు అయితే స్వయంగా బ్యాంక్‌లకు తీసుకు వెళ్లి రుణాలు ఇప్పించేదుకు సిద్ధంగా ఉన్నానని సాధిక్ తెలిపారు. అనంతరం వార్డులో మరమ్మతులకు గురైన కాలువలను పరిశీలించారు. వెంటనే కొత్త కాలువలు నిర్మిస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల చేర్పులు, మార్పులపై దృష్టి


మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేయడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి వారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ ప్రతినిధుల దృష్టికి వచ్చిన సమస్యలు తెలియజేస్తే పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో కె.కృష్ణకాంత్(వైఎస్సార్‌సీపీ), గోపాల్‌రెడ్డి(టీడీపీ), బుద్ధ లక్ష్మీనారాయణ(బీజేపీ), ఎస్.సుధాకర్(కాంగ్రెస్), ఇతర పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


మల్లువలస ధనేశ్వరరావు

అల్లిపురం: స్థానిక జెండాచెట్టు వీధికి చెందిన మల్లువలస ధనేశ్వరరావు కనిపించడం లేదని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జెండాచెట్టువీధికి చెందిన ధనేశ్వరరావు ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన తిరిగి రాలేదు. అప్పటి నుంచి నగరంలో పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో అతని కుమారుడు ఆదిత్య ఈశ్వర్ పేర్కొన్నారు. తప్పిపోయిన వ్యక్తి వయస్సు 52 సంవత్సరాలు ఉంటుందని, 5 అడుగుల 8 అంగులాల పొడవు కలిగి, తెలుపు రంగు శరీర చాయతో ఉంటాడని, పసుపు రంగు టీ షర్టు వేసుకుని, నాచురంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. ఆ చూకీ తెలిసిన వారు 0891-2746866, 9849258484 నంబర్లలో తెలియజేయాలని కోరారు.

జాబ్ మేళాకు విశేష స్పందన


విద్యార్థికి ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి తదితరులు

అల్లిపురం: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో జేకేసీ, నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. పలు ప్రముఖ కంపెనీలైన ఆటోసైన్స్, టాటా క్యాపిటల్ మైక్రో ఫైనాన్స్, అరబిందో ఫార్మా, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరామ్ ఫైనాన్స్, పేటీఎం, ఎన్ఎస్ ఇన్వెస్ట్‌మెంట్స్, టీసీఎల్ సీసాట్ పాల్గొన్న ఈ జాబ్‌మేళాకు 286 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. 66 మంది ప్లేస్‌మెంట్ పొందినట్టు జేకేసీ మెంటార్ వీఎన్ రాజు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో జేకేసీ సమన్వయకర్త డి.అరుణపద్మ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతి


ఎర్రయ్య మృతదేహం

మల్కాపురం: చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన ఓ వ్యక్తి.. అదే చోట శవమై తేలాడు. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. వన్‌టౌన్ రెల్లివీధి ప్రాంతానికి చెందిన మారుపల్లి ఎర్రయ్య(37) ఈ నెల 20న ఎస్‌బీసీ(షిప్ బిల్డింగ్ సెంటర్) ఎదురుగా డాక్‌యార్డ్ వంతెన వద్ద చేపలు పట్టేందుకు వచ్చాడు. ఈ క్రమంలో అతను అక్కడి సముద్ర తీరంలో గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని అతనితో వచ్చిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. గాలింపు చర్యలు చేపట్టారు. అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో.. ప్రత్యేక బృందాన్ని రప్పించారు. సోమ, మంగళవారాల్లో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. చివరకు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఎర్రయ్య మృతదేహం నీటిపైకి తేలింది. ఈ విషయాన్ని పోలీసులు అతని బంధువులకు తెలిపి.. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసును ఎస్ఐ దేవుడమ్మ దర్యాప్తు చేస్తున్నారు. కాగా. ఎర్రయ్య మానసిక పరిస్థితి సరిగ్గా లేదని తెలిసింది. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారితో ఎర్రయ్య కలిసి ఉండటం లేదని సమచారం.

జయహో భారత్


జగదాంబ జంక్షన్‌లో సంబరాలు నిర్వహిస్తున్న దిబ్బలపాలెం యూత్ అసోసియేషన్ సభ్యులు

డాబాగార్డెన్స్: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో నగర ప్రజల్లో ఉత్సాహం ఉరకలేసింది. మువ్వన్నెల జెండా చేత పట్టి జయహో భారత్ అంటూ నగర వీధుల్లో సందడి చేశారు. బైక్‌లపై జాతీయ జెండా పెట్టుకుని రెపరెపలాడించారు. ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగాన్ని విజయవంతం చేసి ప్రపంచ పటంలో సగర్వంగా నిలిపినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని జగదాంబ జంక్షన్ వద్ద దిబ్బలపాలెం యూత్ అసోసియేషన్ సభ్యులు త్రివర్ణ పతాకం చేతపట్టి జయహో ఇస్రో నినాదాలు చేస్తూ సంబరాలు జరుపుకొన్నారు. చరిత్ర సృష్టించిన ఇస్రోకి జేజేలు పలికారు. యూత్ సభ్యులు ఉరికిటి గిరీష్, తేజ, శ్రీనివాస్‌రాజు, యశ్వంత్, తాటితూరి హరి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, పలు విభాగాల అధికారులు

మహారాణిపేట: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పనిచేయాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ కోరారు. టంగుటూరి జయంతి సందర్భంగా బుధవారం కేజీహెచ్‌లో ఆయన చిత్ర పటానికి సూపరింటెండెంట్‌తో పాటు ఇతర అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ కె.వాసుదేవ, ఏఎస్ఆర్ఎంవోలు డాక్టర్ కె.జగదీష్‌కుమార్, డాక్టర్ కె.వి.అరుణకుమారి, అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్.శ్రీనివాసకుమార్, అకౌంట్ ఆఫీసర్ జోగిరాజు, నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పన మాళి పాల్గొన్నారు.

ఉత్సాహంగా అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు


పోటీల విజేతలతో ప్రిన్సిపాల్ షైజీ, అధ్యాపకులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు ఉత్సాహంగా సాగాయి. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ కౌశలం, ప్రతిభా పాటవాలను ప్రోత్సహించే దిశగా ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖలోని సుమారు 15 కళాశాలలకు చెందిన విద్యార్థులు వక్తృత్వం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాసరచన, కథా వాచనం మొదలగు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చూపారు. తెలుగు, హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లో వీటిని నిర్వహించారు. డాక్టర్ పి.అరుణాదేవి విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించారు. సెయింట్ జోసెఫ్, డాక్టర్ వీఎస్ కృష్ణ, గాయత్రి, వినెక్స్, యూనిటీ కళాశాలలు విజేతలుగా నిలిచాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ నిర్మల, డాక్టర్ దీప్తి, సిస్టర్ జైన్, కోటేశ్వరావు, గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు వితరణ


ఆర్థిక సాయం, సరకులు అందజేస్తున్న సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్ నారాయణరావు

మహారాణిపేట: జీవీఎంసీ 29వ వార్డుకు చెందిన రెండు నిరుపేద కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలిచారు. కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ యు.నారాయణరావు ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్ బుధవారం ఆర్థిక సహాయం, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. కృష్ణానగర్‌లో నివాసముంటున్న లెక్కల దాలినాయుడు కుటుంబానికి సరకులు, ఆర్థిక సహాయం చేశారు. వెంకటపతిరాజు నగర్‌లో ఉంటున్న సింగంపల్లి శివ కుమార్(ఫుట్‌బాల్ క్రీడాకారుడు) రెండు కిడ్నీలు పాడైపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందికరంగా ఉందని తెలుసుకున్న పార్టీ నాయకులు ఈ మేరకు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భారీ గణేషుడి విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం


దొండపర్తి రామాలయం వద్ద పూజలు చేస్తున్న నీలాపు సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార: వైఎస్ జగన్ యువసేన ఆధ్వర్యంలో బుధవారం దొండపర్తిలోని రామాలయం వద్ద భారీ గణనాథుడి విగ్రహం ఏర్పాటు పనులు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, టీం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వెస్ట్ బెంగాల్ ఖరగ్‌పూర్‌కు చెందిన కళాకారుడు శక్తి పాల్ బృందం చేత భారీ విగ్రహం తయారు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గతేడాది 102 అడుగుల గణపతి ఏర్పాటు చేసినట్లు సర్వేశ్వరరెడ్డి తెలిపారు. 21 రోజుల పాటు విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 18న వినాయక చవితి సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సర్వేశ్వరరెడ్డి అండ్ టీం సొంత నిధులు రూ.5 లక్షలతో భారీ గణపతిని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మధురెడ్డి, అజయ్ రెడ్డి, శివ, గురుమూర్తిరెడ్డి, సతీష్, అశోక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభి షేకం


అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. జలాభిషేకం కోసం పసుపు నీటి బిందెలతో భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ముందుగా ప్రధానార్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకంతో పాటు పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు తమ స్వహస్తాలతో జలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పసుపు, కుంకుమతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, పైడా కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ సరోజ్

డాబాగార్డెన్స్: పైడా ఉమెన్స్ డిగ్రీ కాలేజీ వార్షికోత్సవం బుధవారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి.. పైడా కళాశాలల అధినేత పైడా కృష్ణప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమన్నారు. కన్న తల్లిదండ్రులకు, చదువుకున్న కళాశాలకు పేరుప్రఖ్యాతలు తీసుకొచ్చే దిశగా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నిబద్ధతతో కూడిన విద్య ఎంతో అవసరమని తాను నమ్ముతానన్నారు. విద్యార్థినులను ఉన్నత శిఖరాల్లో నిలిపి, వారిని ప్రయోజకులను చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, దేశ చరిత్రను తెలిపే అంశాలతో కూడిన ప్రదర్శన తీరు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ డి.సరోజ్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.